సాక్షి
యాదాద్రి భువనగిరి

ఆదివారం । 2 । ఏప్రిల్ । 2023



యాదాద్రి కొండపై భక్తులకు కష్టాలు
భానుడి భగభగలతో యాదాద్రీశుడి దర్శనానికి వచ్చిన భక్తులు ఉరుకులు పరుగులు పెట్టక తప్పడంలేదు. - 8లో



అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి
ఏబీవీపీ జాతీయ మాజీ కార్యదర్శి కడియం రాజు అకాల మరణం తీరని లోటు అని బండి సంజయ్ అన్నారు. - 10లో

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం 37°/24°
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది.



యాదాద్రీశుడికి లక్ష పుష్పార్చన

యాదగిరిగుట్ట రూరల్ : ఏకాదశిని పురస్కరించుకొని శనివారం యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో లక్ష పుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖమండపంలోని ఉత్సవ మూర్తులను దివ్య మనోహరంగా అలంకరించారు. అర్చకులు, వేద పండితులు సహస్రనామ పఠనాలు పఠిస్తూ స్వామి, అమ్మవార్లకు వివిధ రకాల పుష్పాలతో అర్చన గావించారు. అదే విధంగా ప్రధానాలయంలో నిత్య కంకర్యాలు కొనసాగాయి. వేకువజామున సుప్రభాత సేవ, ఆ తర్వాత నిజాభిషేకం, సహస్తనామార్చన, కుంకుమార్చన చేపట్టారు. ముఖమండపం, ప్రాకార మండపంలో ఉత్సవ మూర్తులకు సువర్ణ పుష్పార్చన, సుదర్శననారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకళ్యాణం, బ్రహోత్సవం, సాయంత్రం జోడు సేవ తదితర పూజలు చేశారు. వివిధ విభాగాల ద్వారా నిత్యాదాయం రూ.48,81,789 సమకూరినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.


పూజలు నిర్వహిస్తున్న ఆచార్యులు

స్వయం ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని జలాల్‌పురంలో గల స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థలో నిరుద్యోగ యవతీ, యువకులకు సమ్మర్ స్పెషల్ బ్యాచ్ కోర్సులైన ఆటోమొబైల్ బైక్ సర్వీసింగ్, బేసిక్ కంప్యూటర్స్ అండ్ ఇంగ్లీష్, అకౌంట్స్ అసిస్టెంట్ (ట్యాలీ)లో ఉచిత శిక్షణ ఇస్తున్నారు. ఈ మేరకు సంస్థ డైరెక్టర్ పీఎస్ఎస్ఆర్ లక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆటోమొబైల్‌కు టెన్త్, బేసిక్ కంప్యూటర్ అండ్ ఇంగ్లిష్‌కు ఇంటర్ పాస్ లేదా ఫెయిల్, అకౌంట్ అసిస్టెంట్ కోర్సుకు ఇంటర్(సీఈసీ) విద్యార్హత కల్గి ఉండాలన్నారు. ఆసక్తి కల్గిన అభ్యర్థులు తమ విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, పాస్ పోర్ట్‌సైజ్ ఫొటోలతో ఈ నెల 10న సంస్థలో నేరుగా హాజరు కావాలన్నారు. ఎంపికైన విద్యార్థులు కోర్సు ఫీజు రూ.1000, హాస్టల్ వసతికి రూ.3 వేలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇతర వివరాలకు 9133908000, 9133908111, 9133908222 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

న్యూస్‌రీల్

కొనసాగుతున్న శ్రీరామనవమి ఉత్సవాలు

యాదగిరిగుట్ట రూరల్ : యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామికి అనుబంధంగా ఉన్న శ్రీ పర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో సీతారామచంద్ర స్వామి వసంత నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం నిత్యారాధనల అనంతరం శ్రీ సీతారామ హనుమత్ మూర్తులకు మూల మంత్ర జపాలు, దశశాంతి, పంచ సూక్తి పారాయణాలు, అభిషేకాలు, ఆధ్యాత్మిక రామాయణ పారాయణం, అష్టోత్తర శతనామార్చనాలు నిర్వహించారు. ఆ తర్వాత సత్యనారాయణ స్వామి వ్రత వేడుక చేపట్టారు. ఈ వేడుకల్లో ఆలయ అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి, ఈఓ గీతారెడ్డి, ఉప కార్యనిర్వాహణ అధికారి, సహాయ కార్య నిర్వాహణ అధికారులు, పర్యవేక్షకులు, ఉద్యోగ సిబ్బంది పాల్గొన్నారు.

పరిహారం ఇంకెప్పుడిస్తరు?


బస్వాపురం రిజర్వాయర్ వద్ద దీక్ష చేస్తున్న లప్పానాయక్ తండావాసులు

యాదగిరిగుట్ట రూరల్ : బస్వాపురం రిజర్వాయర్‌లో ముంపునకు గురవుతున్న తమకు జాప్యం చేయకుండా పరిహారం, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని యాదగిరిగుట్ట మండలంలోని లప్పానాయక్ తండావాసులు డిమాండ్ చేశారు. రిజర్వాయర్ కట్టపైన తండావాసులు చేపట్టిన దీక్ష 17వ రోజు శనివారం కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రెండు వారాలకు పైగా దీక్ష చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ప్రాజెక్టులో సర్వస్వం కోల్పోతున్నామని, ప్రభుత్వం తమకు ఇచ్చిన హామీ మేరకు దాతర్‌పల్లిలోని 294 సర్వే నంబర్‌లో పునరావాసం కల్పించాలని, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ డబ్బులు, వ్యవసాయ భూములకు పరిహారం ఇవ్వాలని కోరారు. నిర్వాసితులకు న్యాయం జరిగే వరకు నిరాహార దీక్ష కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దీరావత్ బుజ్జి శంకర్, ఉప సర్పంచ్ మంక్యా నాయక్, రవికాంత్, బిచ్యా నాయక్, భరత్, తండావాసులు పాల్గొన్నారు.

న్యాయ సేవలను సులభతరం చేస్తాం


జడ్జిని సన్మానిస్తున్న న్యాయవాదులు

చౌటుప్పల్ : న్యాయసేవలను సులభతరం చేయనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి బాల భాస్కర్ పేర్కొన్నారు. చౌటుప్పల్‌లోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టును శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవిష్యత్‌లో అదనపు, పోక్సో కోర్టు ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. నూతనంగా ఎన్నికైన బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు న్యాయమూర్తిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తాడూరి పరమేష్, కోశాధికారి పడమటి మహిపాల్‌రెడ్డి, సహాయ కార్యదర్శి జిల్లా రమేష్, జక్కర్తి శేఖర్, న్యాయవాదులు ముత్యాల సత్తిరెడ్డి, ఊడుగు శ్రీనివాస్, స్వాతి, తడక మోహన్, మక్తల్ నర్సింహ, బడుగు శ్రీకాంత్, ఎండీ ఖయ్యూంపాష పాల్గొన్నారు.

నేడు భువనగిరి ఖిలాపై స్వచ్ఛభారత్

భువనగిరిటౌన్ : స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా ఆదివారం భువనగిరి ఖిలాపై స్వచ్ఛ భారత్ నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బి.నాగిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటలకు నిర్వహించనున్న కార్యక్రమంలో ఐజీ తరుణ్‌జోషి హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఉత్తమ ర్యాంక్ సాధించడమే లక్ష్యంగా పారిశుద్ధ్యం, ప్లాస్టిక్ నిషేధం అమలుతో పాటు వివిధ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. పట్టణ ప్రజలు, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, యువకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మార్పు కోసం.. ముందడుగు


ఎల్‌బీ నగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీ దేవేంద్రసింగ్ చౌహాన్

నేరస్తుల్లో పరివర్తనకు రాచకొండ పోలీసుల ప్రయత్నం
- ఉపాధి, ఉద్యోగ అవకాశాల కల్పన
- పిల్లలకు గురుకుల పాఠశాలల్లో విద్య
- స్వచ్ఛంద సంస్థల సహకారంతో కార్యక్రమాలకు శ్రీకారం

సాక్షి,యాదాద్రి : నేరస్తుల్లో మార్పు తీసుకువచ్చి, ఆ తర్వాత కాలంలో వారు ఉన్నతంగా జీవించడం కోసం రాచకొండ పోలీసుల ఆధ్వర్యంలో 'మార్పు కోసం.. ముందడుగు' పేరుతో సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు గౌరవప్రదమైన జీవనం గడపడానికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడం, వారి పిల్లలకు మంచి చదువు చెప్పించడం వంటి కార్యక్రమాలకు స్వచ్ఛంద సంస్థల సహకారంతో రూపకల్పన చేశారు. ఇందులో భాగంగా రాచకొండ పరిధిలోని భువనగిరి, మల్కాజిగిరి, ఎల్‌బీనగర్, మహేశ్వరం జోన్‌లల నేరస్తులతో సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే మల్కాజిగిరి, ఎల్‌బీనగర్‌లో ఏర్పాటు చేయగా భువనగిరి జోన్‌లో నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

నేరాల నియంత్రణే లక్ష్యంగా..
ప్రధానంగా చోరీలకు పాల్పడుతున్న వారు పోలీసులకు పట్టుబడి జైలుకు వెళ్లడం, బయటకు రాగానే తిరిగి తమ ప్రవృత్తి కొనసాగించడం పరపాటిగా మారింది. దీంతో కేసులు పెరిగిపోతున్నాయి. అంతే కాకుండా ప్రజల ఆస్తిపాస్తులకు రక్షణ లేకుండాపోతుంది. చోరీలకు పాల్పడకుండా వారిలో మార్పు తీసుకురావడానికి పోలీసు శాఖ స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు రూపొందిస్తున్నారు. వయస్సు రీత్యా చేయగలిగే పనులు, వారిలోని నైపుణ్యానికి అనుగుణంగా సెక్యూరిటీ గార్డు ఉద్యోగాలు ఇప్పించడం, టీ దుకాణాలు ఏర్పాటు చేయించడం, మెకానిక్‌లుగా శిక్షణ ఇప్పించి ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారు. దొంగతనాలు చేసి జైలుకు వెళ్లిన నిందితుల పిల్లలకు ప్రభుత్వ గురుకుల విద్యా సంస్థల్లో చేర్పించనున్నారు.

స్వచ్ఛంద సంస్థల సహకారం
రాచకొండ పోలీసులు చేపట్టిన 'మార్పు కోసం ముందడుగు' కార్యక్రమంలో ప్రస్తుతం లయన్స్ క్లబ్, రాంకీ ఫౌండేషన్ సంస్థలు పాల్గొంటున్నాయి. రాంకీ ఫౌండేషన్ చైర్మన్ రాంరెడ్డి, లయన్స్‌క్లబ్ రీజినల్ సెక్రటరీ లయన్ విద్యాభూషణ్, లయన్స్ క్లబ్ గ్రీన్ ల్యాండ్ అధ్యక్షులు డాక్టర్ లక్ష్మి కుమారి సహకరిస్తున్నారు.

మార్పు వస్తే సహకరిస్తాం



మనం మారాలి.. మన పిల్లల భవిష్యత్ మారాలన్న ఆలోచనకు కార్యరూపం ఇవ్వడమే 'మార్పు కోసం ముందడుగు' కార్యక్రమ ఉద్దేశం. దీర్ఘకాలికంగా నేరాలకు దూరంగా ఉన్నప్పటికీ కొందరి పేర్లు ఇంకా నేరస్తుల జాబితాలో ఉంటున్నాయి. అలాంటి వారి పేర్లు తొలగిస్తాం. నేరచరిత్ర ఉన్న వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తే వారిలో కొందరైనా సత్ప్రవర్తన అలవర్చుకుంటారు. నేరాలు కూడా తగ్గుతాయి. పోలీసు శాఖ ఇచ్చే కౌన్సెలింగ్ ద్వారా మార్పు వచ్చి మంచి జీవితం గడిపితే సహకరిస్తాం.తిరిగి నేరాలకు పాల్పడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.
–మధుకర్‌స్వామి, డీసీపీ, రాచకొండ క్రైం విభాగం

800 మంది గుర్తింపు
రాచకొండ కమిషనరేట్ పరిధిలో చోరీ కేసుల్లో జైలుకు వెళ్లొచ్చిన 800 మందిని పోలీసులు గుర్తించారు. వీరిలో కూడా తరచు చోరీలకు పాల్పడే వారి నేరచరిత్ర, వారి కుటుంబ పరిస్థితులు, కుటుంబీకుల ఆరోగ్యం, పిల్లల చదువుకు సంబంధించిన వివరాలను సేకరిస్తారు. నాలుగైదు సంవత్సరాలుగా నేరాలకు పాల్పడకుండా జీవిస్తున్న వారి పేర్లను నేరస్తుల జాబితా నుంచి తొలగిస్తారు. మత్తు పదార్థాలకు బానిసలైన వారికి మానసిక వైద్యులతో కౌన్సెలింగ్ ఇప్పిస్తారు.

ఆస్తిపన్ను వసూలు అంతంతే!

- లక్ష్యం చేరని మున్సిపాలిటీలు
- మోత్కూరులో అత్యధికంగా 90.67 శాతం
- మార్చి 31తో ముగిసిన ఆర్థిక సంవత్సరం

భూదాన్‌పోచంపల్లి : మున్సిపాలిటీల్లో 2022 – 2023 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్ను వసూళ్లకు మార్చి 31తో గడువు ముగిసింది. జిల్లాలో ఆరు మున్సిపాలిటీలు ఉండగా ఏ ఒక్క చోట లక్ష్యం చేరలేదు. వంద శాతం పన్ను వసూలు చేయడానికి అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. అందులో భాగంగా బకాయిదారులకు నోటీసులు జారీ చేశారు. పలు చోట్ల దుకాణాలు సీజ్ చేసినా, ఇళ్లకు తాళం వేసినా, నల్లా కనెక్షన్లు తొలగించినా పూర్తిస్థాయిలో పన్నులు రాబట్టలేకపోయారు. ఆస్తి జప్తు చేస్తామని హెచ్చరించినా ఫలితం లేకపోయింది. అయితే కొన్ని మున్సిపాలిటీల్లో గత ఆర్థిక సంవత్సరం కంటే మెరుగ్గా ఉండగా మరి కొన్నింటిలో తగ్గింది.

మున్సిపాలిటీల వారీగా లక్ష్యం, వసూళ్లు
భూదాన్‌పోచంపల్లిలో.. రూ.1.74 కోట్లు లక్ష్యంగా కాగా రూ.1.14 కోట్లు వసూలయ్యాయి. గత ఆర్థిక సంవత్సరం 68 శాతం వసూలు కాగా ఈసారి 65.61 శాతానికి తగ్గింది.
చౌటుప్పల్ : రూ.5.50 కోట్ల మేర ఆస్తి పన్ను లక్ష్యం కాగా రూ.3.96 కోట్లు రాబట్టారు. మొత్తంగా 72 శాతం వసూలయ్యాయి. రూ.1.54 కోట్లు పెండింగ్ ఉన్నాయి. ఇందులో మున్సిపాలిటీ పరిధిలో లాకౌట్‌లో ఉన్న, సక్రమంగా నడవని పరిశ్రమల బకాయిలు రూ.50లక్షల వరకు ఉన్నాయి. మిగిలిన బకాయిలు రెగ్యూలర్‌వే అయినప్పటికీ ఆర్థిక సంవత్సరంలోపు వసూలు జరగలేదు.
ఆలేరు రూరల్ : ఆలేరు మున్సిపాలిటీలో వివిధ రకాలకు చెందిన 4,677 భవనాలు ఉన్నాయి. ఆస్తి పన్ను లక్ష్యంగా రూ.1.92 కోట్లు కాగా రూ.1.15 కోట్లు వసూలయ్యాయి. ఇంకా రూ.77లక్షలు వసూల కావాల్సి ఉంది. మొత్తం 68.83 శాతం వసూలు చేశారు.


మోత్కూరులో సిబ్బందితో కలిసి పన్నులు వసూలు చేస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ (ఫైల్)

మోత్కూరులో అత్యధికంగా..
మోత్కూరు : మోత్కూరు మున్సిపాలిటీలో ఆస్తి పన్ను రూ.1.08 కోట్లు డిమాండ్ కాగా రూ.89.61 లక్షలు వసూలైంది. 90.67 శాతం పన్నులను అధికారులు రాబట్టారు. ప్రైవేట్ ఆస్తుల నుంచి అధికంగా వసూలయ్యాయి. పోలీస్ స్టేషన్, తహసీల్దార్, మండల పరిషత్, ఐసీడీఎస్, రిజిస్ట్రేషన్, ట్రాన్స్‌కో అత్యధికంగా బకాయి ఉన్నాయి.

బకాయిలపై శ్రద్ధ వహించాం



మొండి బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించాం. బకాయిల తీవ్రతను బట్టి సంబంధికులకు నోటీసులు ఇచ్చాం. ఇళ్లకు నల్లా కనెక్షన్లు తొలగించాం. అసలే చెల్లించలేం అన్న వారి నుంచి కూడా వసూలు చేశాం.
–సి.శ్రీకాంత్, మున్సిపల్ కమిషనర్

మహనీయుల జయంతికి ఏర్పాట్లు చేయండి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారీ


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, చిత్రంలో ఆర్డీఓ భూపాల్‌రెడ్డి

భువనగిరిటౌన్ : జగ్జీవన్ రాం, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దీపక్ తివారీ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో జిల్లా ఎస్సీ, అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో దళిత, యువజన సంఘాల ప్రతినిధులు, అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ నెల 5న బాబూ జగ్జీవన్‌రాం, 14న అంబేద్కర్ జయంతి సందర్భంగా చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. సూచనలు, సలహాలు చేశారు. మహనీయుల విగ్రహాలను అందంగా అలంకరించాలని, సభా వేదికలు ఏర్పాటు చేయనున్న ప్రాంతాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలన్నారు. తాగునీటి సౌకర్యం కల్పించాలని, మజ్జిగ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భువనగిరి ఆర్డీఓ ఎంఈ భూపాల్‌రెడ్డి, ఏసీపీ సైదిరెడ్డి వెంకట్‌రెడ్డి, జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి జైపాల్‌రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమే


జిల్లా కేంద్ర ఆస్పత్రిలో చిన్నారిని ఎత్తుకున్న జయలక్ష్మి, చిత్రంలో జిల్లా అధ్యక్షురాలు సుర్వి లావణ్య

- బీజేపీ మహిళా మోర్చా పాండిచ్చేరి అధ్యక్షురాలు జయలక్ష్మి

సాక్షి, యాదాద్రి : తెలంగాణలో రానున్నది బీజేపీ ప్రభుత్వమేనని పార్టీ మహిళా మోర్చా పాండిచ్చేరి అధ్యక్షురాలు జయలక్ష్మి ధీమా వ్యక్తం చేశారు. శనివారం భువనగిరిలో బీజేపీ మహిళా మోర్చ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ ప్రవాసీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ మార్పు కోరుకుంటున్నారని పేర్కొన్నారు. మోదీ సర్కార్ అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్, మాతృవందనాయోజన కార్యక్రమాల సత్ఫలితాలు ఇస్తున్నాయన్నారు. బీజేపీ అనుబంధ సంఘాల బలోపేతంలో భాగంగా మహిళా మోర్చను పటిష్ఠం చేస్తున్నట్లు తెలిపారు. అంతకు ముందు పోచమ్మవాడలో ఆశ వర్కర్లు, సీనియర్ సిటిజన్లతో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో మహిళా మోర్చ లీగల్ సెల్ రాష్ట్ర నాయకురాలు ప్రసన్న, కౌన్సిలర్లు జనగాం కవిత, నల్లమాస సుమ, మహిళామోర్చ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుర్విలావణ్య, రాజమణి, మాధురి చంద్ర, చందా శ్రీలత, దొంత సుమిత్ర, సత్యలక్ష్మి పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి
భువనగిరి : పట్టణంలోని సింగన్నగూడెం వద్ద ఉన్న అంగన్‌వాడీ కేంద్రం, జిల్లా కేంద్ర ఆస్పత్రి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బీజేపీ మహిళా మోర్చా పాండిచ్చేరి రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి సందర్శించారు. అక్కడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఎస్వీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పరిశుభ్రత సక్రమంగా లేకపోవడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ఆశ కార్యకర్తల కొరత ఉందని, ప్రతి 6వేల మందికి ఒకరు పని చేయడం భారంతో కూడుకున్నదన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ లీగల్ టీం సభ్యులు ప్రసన్న, జిల్లా అధ్యక్షురాలు సుర్వి లావణ్య ప్రధాన కార్యదర్శి రాజమణి, మాధురి, ఉపాధ్యక్షురాలు వైజయంతి, సభ్యులు పాల్గొన్నారు.

గూడు లేని బతుకులు!

రెండు దశాబ్దాలుగా గుడిసెల్లోనే
- అర్హతలున్నా రాని డబుల్ బెడ్‌రూం ఇళ్లు
- ఫిర్యాదు చేయడానికి కలెక్టరేట్‌కు క్యూ కడుతున్న బాధితులు
- సోమవారం ధర్నా చేసేందుకు సన్నాహాలు

భువనగిరిటౌన్ : భువనగిరి మున్సిపాలిటీ పరిధి సింగన్నగూడెం వద్ద నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్ల కేటాయింపులో అధికారుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిరుపేదలకు అన్యాయం జరిగిందంటూ ఫిర్యాదు చేయడానికి దరఖాస్తుదారులు కలెక్టరేట్‌కు క్యూ కడుతున్నారు. శుక్రవారం ఒక్క రోజే 50కి పైగా ఫిర్యాదులు అందాయి. సింగన్నగూడెం వద్ద మొత్తం 444 ఇళ్లు నిర్మించగా 3,415 దరఖాస్తులు వచ్చాయి. అధికారులు రెండు దఫాలు విచారణ చేసి జాబితా రూపొందించారు. మార్చి 29వ తేదీన ఇళ్ల పంపిణీ ప్రక్రియ పూర్తయ్యింది. అయితే ఇళ్లు రాని వారు ఆందోళనలకు దిగుతున్నారు. అర్హులను గుర్తించడంలో అధికారులు విఫలం అయ్యారని, 90 శాతం ఇళ్లు పైరవీకారులకు, అనర్హులకు కేటాయించారని ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా డ్రా తీసే సమయంలో కేవలం ప్రజాప్రతినిధులు, అధికారులు మాత్రమే ఉన్నారని, వారు చెప్పిన పేర్లు జాబితాలో నమోదు చేసి డ్రాలో వేశారని, వాహనాలు ఉన్న వారికి సైతం ఇళ్లు వచ్చాయని వాపోతున్నారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేయడానికి దరఖాస్తుదారులతో పాటు రాజకీయ పార్టీలు సిద్ధమవుతున్నాయి.

27 ఇళ్లు పెండింగ్
444 ఇండ్లను ఎస్టీలకు 27, మాజీ సైనికోద్యోగులు 9, ఎస్సీలు 75, మైనార్టీలు 53, వికలాంగులు 22, ఇతరులకు 258 ఇళ్లు కేటాయించారు. మిగిలిన 27 ఇళ్లను పంపిణీ చేయకుండా పెండింగ్ ఉంచారు.


ఈ మహిళ పేరు మచ్చోజు ఉమారాణి. వీరిది నిరుపేద కుటుంబం. దంపతులిద్దరూ కూలి పనులకు వెళ్తుంటారు. భువనగిరిలోని బంజరాహిల్స్ ప్రాంతంలో రెండు దశాబ్దాలుగా చిన్నపాటి పూరి గుడెసెలో జీవనం సాగిస్తున్నారు. డబుల్ బెడ్‌రూం ఇంటి కోసం దరఖాస్తు చేసుకోగా అధికారులు రెండు సార్లు విచారణ చేశారు. కానీ, ఇల్లు మాత్రం రాలేదు. వీరికి ముగ్గురు సంతానం. పెద్ద కుమారుడు 5వ తరగతి చదువుతుండగా, ఇద్దరు అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్తున్నారు. తమకు ఎలాంటి ఆస్తిపాస్తులు లేవని, ఇల్లు ఇచ్చి ఆదుకోవాలని అధికారులను వేడుకుంటుంది. ఉమారాణి కుటుంబం ఒక్కటే కాదు.. భువనగిరి మున్సిపాలిటీ పరిధిలో మరెన్నో కుటుంబాలు దర్భర జీవితం గడుపుతున్నాయి.

25 ఏళ్లుగా కిరాయి ఇంట్లోనే..



25 ఏళ్ల నుంచి అద్దె ఇంట్లో ఉంటున్నాం. నాకు పూర్తిగా చేతకాదు. కుటుంబం గడవడం చాలా కష్టంగా ఉంది. డబుల్ బెడ్ రూం ఇల్లు వస్తదని ఎంతో ఆశ ఉండే. చివరికి నిరాశ ఎదురైంది. పేదరికంలో కొట్టుమిట్టాడుతున్నం. ఇల్లు రాక పోవడంతో ఆత్మహత్య చేసుకోవాలని అనిపిస్తుంది.
–సిద్దుల లలిత– రమేష్, ప్రగతినగర్, భువనగిరి

ఇల్లు వస్తే అక్క పెళ్లి చేయాలనుకున్న



మా చిన్నప్పుడే అమ్మ, నాన్న చనిపోయారు. అక్క, నేను కిరాయి ఇంట్లో ఉంటున్నాం. ఏరియా ఆస్పత్రి వద్ద హోటల్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాం. డబుల్ బెడ్ రూం ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నా. జాబితాలో పేరొచ్చినా డ్రాలో రాలేదు. డబుల్ బెడ్‌రూం వస్తే అందులో మా అక్క పెళ్లి చేయాలనుకున్న.
–కటకం రవి, భువనగిరి

స్థలం, ఆర్థిక సాయం అందజేయాలి



ఇళ్లు రాని నిరుపేదల మనస్థాపానికి గురవుతున్నారు. అలాంటి వారికి ప్రభుత్వ స్థలం కేటాయించడంతో పాటు గృహలక్ష్మి పథకం కింద ఇల్లు కట్టుకోవడానికి ఆర్థిక సహాయం అందజేయాలి. న్యాయం జరగకపోతే ఆందోళన చేపడుతాం. అధికారులు నెల రోజుల్లో ప్రక్రియను పూర్తి చేయాలి.
–కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు

క్రమబద్ధీకరణకు దరఖాస్తుల ఆహ్వానం

భువనగిరిటౌన్ : ప్రభుత్వ భూముల్లో నిర్మించుకున్న ఇళ్లను క్రమబద్ధీకరించుకునేందుకు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏప్రిల్ 30లోగా మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తులు సమర్పించాలన్నారు. 2014 జూన్ 2 కటాఫ్ తేదీ ఉండగా దాన్ని 2020 జూన్ 2వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం పొడిగించిందన్నారు. క్రమబద్ధీకరణకు సంబంధించి 58,59 జీఓల్లోని నిబంధనలకు అనుగుణంగా దరఖాస్తు ఫారాల్లో వివరాలు నమోదు చేయాలని సూచించారు. సంబంధిత డాకుమెంట్లను దరఖాస్తు ఫారానికి జత చేయాలన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గొర్రెల పంపిణీకి ఏర్పాట్లు చేస్తాం

భువనగిరిటౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గొర్రెల పంపిణీ పథకం రెండవ విడత కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేయాలని, అవకతవకలకు తావుండవద్దని రాష్ట్ర పశు సంవర్థక, సినిమాటోగ్రఫి శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదేశించారు. శనివారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో కలిసి హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రెండవ విడత గొర్రెల పంపిణీ, కంటి వెలుగు, ఆరోగ్య మహిళ, ప్రభుత్వ స్థలాల్లో నిర్మించుకున్న ఇళ్ల క్రమబద్ధీకరణ తదితర అంశాలపై సమీక్షించారు. గొర్రెల పంపిణీ పారదర్శకంగా చేపట్టాలన్నారు. గొర్రెల పంపిణీకి ఏర్పాట్లు చేస్తామని కలెక్టర్ పమేలా సత్పతి ఈ సందర్భంగా మంత్రికి వివరించారు. కంటి వెలుగు కార్యక్రమం విజయవంతంగా నడుస్తున్నట్లు పేర్కొన్నారు. ఆరోగ్య మహిళ పథకం కింద ఎంపిక చేసిన ఆస్పత్రుల్లో మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, డీఎంహెచ్ఓ మల్లికార్జున్‌రావు, జిల్లా పశు సంవర్థక అధికారి డాక్టర్ కృష్ణ, కలెక్టరేట్ ఏఓ నాగేశ్వరాచారి, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్, అధికారులు

క్లుప్తంగా

ఒకరి దుర్మరణం

కోదాడరూరల్ : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ ఘటన కోదాడ పట్టణ పరిధిలోని దుర్గాపురం క్రాస్‌రోడ్ వద్ద శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అనంతగిరి మండలంలోని కొత్తగూడెం గ్రామానికి చెందిన భుక్య రామ(60) శుక్రవారం రాత్రి టీవీఎస్ ఎక్సెల్‌పై ఓ పనినిమిత్తం కోదాడకు వస్తున్నాడు.ఈ క్రమంలో మార్గ మధ్యలోని దుర్గాపురం క్రాస్‌రోడ్ వద్ద రోడ్డు దాటుతుండగా విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడికి తీవ్ర గాయాలు కావడంతో తొలుత కోదాడ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఖమ్మం ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ రాత్రి మృతిచెందాడు. ప్రమాదానికి కారణమైన కారును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృతుడి కుమారుడు సీతరాంనాయక్ ఫిర్యాదు మేరకు కారు డ్రైవింగ్ చేస్తున్న శాంతిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆలయంలో చోరీ

మఠంపల్లి: గుర్తుతెలియని వ్యక్తులు ఆలయంలో చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన మఠంపల్లి మండలంలోని అల్లీపురం గ్రామ సమీపంలో గల ఉప్పలమ్మ ఆలయంలో శనివారం వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చివరన ఉన్న ఉప్పల మైసమ్మ ఆలయంలోకి శుక్రవారం రాత్రి దుండగులు చొరబడ్డారు. హుండీని పగులగొట్టి రూ.5వేల నగదును అపహరించుకుపోయారు. శనివారం ఉదయం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలాన్ని పరిశీలించారు. అయితే, ఈ ఆలయంలో చోరీ జరగడం నాలుగోసారి అని స్థానికులు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇసుక టిప్పర్‌ల పట్టివేత

కోదాడరూరల్ : ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణలోకి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న నాలుగు టిప్పర్‌లను కోదాడ రూరల్ పోలీసులు శనివారం పట్టుకున్నారు. నందిగామ సమీపంలో గల నాగల్లు ఇసుక క్వారీ నుంచి అనుమతి పత్రాలు లేకుండా హైదరాబాద్‌కు అక్రమంగా ఇసుక తరలిస్తుండగా రామాపురం క్రాస్‌రోడ్ వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. టిప్పర్‌లను సీజ్ చేసి డ్రైవర్, యజమానులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

యువకుడు మృతి

భువనగిరి : రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందాడు. మండలంలోని బొమ్మాయిపల్లికి చెందిన కొంపల్లి శివ(19) గత నెల మార్చి 25న స్నిగ్ధ కాలనీ నుంచి వస్తుండగా కారు ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అతడిని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. అనంతరం అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతున్న శివ శనివారం మృతిచెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపారు.

యాదాద్రి కొండపై భక్తులకు కష్టాలు



యాదాద్రి కొండపై ఎండ వేడికి బండలపై పరుగులు తీస్తున్న భక్తులు

- ఎండవేడికి తట్టుకోలేక పరుగులు
- ఆలయ పరిసరాల్లో కానరాని ఉపశమన చర్యలు

సాక్షి, యాదాద్రి : వేసవి కాలం భానుడి భగభగలు ప్రారంభంతోనే యాదాద్రికొండపైకి వచ్చిన భక్తులు ఉరుకులు పరుగులు పెట్టక తప్పడంలేదు. దేవస్థానానికివస్తున్న వేలాది మంది భక్తులు ఎండకు తట్టుకోలేక అవస్థలు పడుతున్నారు. రాతికొండపై కృష్ణ శిలలతో నిర్మించిన నూతన దేవాలయం ప్రాంగంణం అంతా భగభగమండిపోతోంది. ఉదయం 11 గంటల నుంచే ఫ్లోరింగ్ బండల నుంచి వేడి సెగలు భక్తులను పరుగులు పెట్టిస్తున్నాయి. రూ.150 టికెట్‌తో శీఘ్ర దర్శనం కోసం క్యూలో ఉన్న భక్తులకు నిలువ నీడ లేకుండాపోయింది. ఆలయంలో శ్రీ స్వామి దర్శం పూర్తి చేసుకుని బయటకు వచ్చిన ఫ్లోరింగ్ బండలపై నడిచే భక్తుల కాళ్లు కాలుతున్నాయి. వృద్ధులు వేగంగా నడవలేక అరికాళ్లు కమిలిపోతున్నాయి. దూరంగా ఉన్న ప్రసాదాల విక్రయం వద్దగల నీడ కోసం పరుగులు తీస్తున్నారు. కొండపైన విశాలమైన స్థలం ఉన్నా కనీసం చలువ పందిళ్లు వేయకపోవడంపై భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

యూటీఎఫ్ భాగస్వామ్యం అభినందనీయం

- రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి



రెడ్‌క్రాస్ చైర్మన్, డైరెక్టర్లను సన్మానిస్తున్న నాయకులు

మోత్కూరు : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సామాజిక సేవా కార్యక్రమాల్లో టీఎస్‌యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం అందించిన సహకారం అభినందనీయమని రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. రెడ్‌క్రాస్ చైర్మన్‌గా రెండవసారి ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో లక్ష్మీనర్సింహారెడ్డి, డైరెక్టర్లు కె.ప్రభాకర్‌రెడ్డి, ఎస్.ఎన్.చారి, పన్నాల శ్రీనివాస్‌రెడ్డిలను శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా లక్ష్మీనర్సింహారెడ్డి మాట్లాడుతూ యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం రెడ్‌క్రాస్ సొసైటీలకు రక్త సంబంధం లాంటిదని అన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు అక్కెనపల్లి వెంకటాచారి, స్టడీ సర్కిల్ కన్వీనర్ తొర్ర ఉప్పలయ్య, జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు సూరోజు భాస్కరాచారి, పెన్షనర్స్ సంఘం జిల్లా కోశాధికారి యామగాని బుగ్గయ్య, యూటీఎఫ్ మండలాల నాయకులు మొగుళ్లపల్లి సోమయ్య, వారాల యాదగిరి, బందారపు దుర్గాప్రసాద్, దర్శనం వెంకన్న, దోర్నం వెంకన్న, సత్తయ్య, కేజీవీబీ కన్వీనర్ రేఖ, రెడ్‌క్రాస్ సంస్థ సభ్యులు చాతరాశి అంజయ్య, జె.రవికుమార్, దడిపెల్లి శ్రీనివాసులు పాల్గొన్నారు.

యాదవ సంఘం ఆధ్వర్యంలో ..

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ యాదాద్రి జిల్లా చైర్మన్‌గా రెండవసారి మోత్కూరు నుంచి ఎన్నికైన గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డిని శనివారం యాదవ సంఘం ఆధ్వర్యంలో శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. యాదవ సంఘం నాయకులు జంగ శ్రీను, పురుగుల మల్లయ్య, పురుగుల వెంకన్న, వెంకటనర్సు, అవిశెట్టి స్వామి, జంగ నాగరాజు, అవిశెట్టి సోమయ్య, అవిశెట్టి వెంకన్న, పురుగుల భిక్షం, పురుగుల మల్లయ్య, లింగయ్య పాల్గొన్నారు.

కొండమడుగులోని ఫార్మా కంపెనీలో పేలుళ్లు

- ఇద్దరు కార్మికులకు తీవ్ర గాయాలు



గాయపడిన కార్మికుడు

బీబీనగర్: మండలంలోని కొండమడుగు గ్రామ పరిధి కోజీపార్క్ సమీపంలోని గ్యాస్ట్రిక్ ట్యాబ్‌లెట్స్ తయారయ్యే సిస్ట్రాన్ ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో శనివారం రాత్రి ప్రమాదవశాత్తు పేలుళ్లు సంభవించాయి. పరిశ్రమలో రోజువారీగా ట్యాబ్‌లెట్స్ తయారీ పనులు జరుగుతుండగా రాత్రి ముగ్గురు కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. అలాగే పరిశ్రమ బయట కొండమడుగు గ్రామానికి చెందిన నగేష్‌తో పాటు మరో కార్మికుడు బానోతు మహేష్ వాచ్‌మెన్‌లుగా విధులు నిర్వహిస్తున్నారు. ఒక్కసారిగా పరిశ్రమలో పేలుళ్లు సంభవించాయి. పేలుళ్ల ధాటికి బయట విధులు నిర్వహిస్తున్న నగేష్, మహేష్‌లపై ఇటుకలు, రేకు ముక్కలు ఎగిరిపడడంతో గాయపడ్డారు. వారిద్దరిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిశ్రమలో ఉన్న ముగ్గురు కార్మికులు ప్రాణాలతో బయటపడ్డారు.

ఎయిర్ లీక్ కాకపోవడంతోనే..

ట్యాబ్‌లెట్స్ తయారీ సమయంలో రన్నింగ్‌లో ఉండే మిషనరీలకు ప్రెషర్ గ్యాస్ లీకేజీల నుంచి ఎయిర్ బయటకు వెళ్లకపోవడంతో పేలుళ్లు సంభవించినట్లు తెలుస్తోంది. కాగా ప్రమాదానికి గల కారణం గురించి పరిశ్రమ మేనేజర్‌ను అడగగా ఎయిర్ బయటకు రాకపోవడంతోనే దాని ప్రెషర్ ఎక్కువై పేలుడు జరిగి ఉంటుందని తెలిపారు. పోలీసులు విచారణ జరుపుతున్నారు.

గ్రామస్తుల ఆందోళన

ప్రమాదకరమైన పరిశ్రమలను ఎత్తివేయాలని, వీటి వలన ముప్పు పొంచి ఉందని గ్రామస్తులు పరిశ్రమ వద్ద ఆందోళన చేపట్టారు. గ్రామానికి చెందిన కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

వరకట్న వేధింపుల కేసులో రెండు నెలల జైలు

శాలిగౌరారం: వరకట్న వేధింపుల కేసులో నిందితుడికి నకిరేకల్ జేఎఫ్‌సీఎం కోర్టు రెండు నెలల జైలుశిక్షతో పాటు రూ.500 జరిమానా విధించినట్లు ఎస్‌ఐ సతీష్ శనివారం తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అంబారిపేట గ్రామానికి చెందిన భూపతి శ్రీనివాస్ అదనపు కట్నం తీసుకురావాలని భార్యను శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేసేవాడు. ఈనేపథ్యంలో 2015 నవంబర్ 6న నిందితుడి భార్య శాలిగౌరారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో అప్పటి ఎస్‌ఐ అయోధ్య కేసు నమోదు చేశారు. పూర్తిస్థాయి విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో నకిరేకల్ జూనియర్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్(జేఎఫ్‌సీఎం) కోర్టు న్యాయమూర్తి కావ్య నిందితుడికి రెండు నెలల జైలుశిక్ష, రూ.500లు జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ కేసులో సరైన ఆధారాలు సేకరించి కోర్టుకు అందజేసి నిందితుడికి శిక్ష పడే విధంగా పనిచేసిన అప్పటి విచారణ అధికారి విశ్రాంత సీఐ అయోధ్య, ప్రస్తుత శాలిగౌరారం సీఐ రాఘవరావు, ఎస్‌ఐ సతీష్, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ లక్ష్మణ్‌నాయక్, కోర్టు కానిస్టేబుల్ సతీష్‌లను నల్లగొండ జిల్లా ఎస్పీ అపూర్వరావు అభినందించారు.

కాంగ్రెస్ అధికారంలో వస్తేనే సమస్యలు పరిష్కారం

మిర్యాలగూడ : రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యలన్నీ పరిష్కరిస్తామని డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపడుతున్న హాథ్‌సే హాథ్ జోడో యాత్ర శనివారం దామరచర్ల మండంలోని కేశవాపురం, రామోజితండా, మాస్‌తండా, దనియాలతండాలో కొనసాగింది. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్, మాలి కాంతారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాదిల శ్రీను, సర్పంచ్ జనార్దన్‌నాయక్ పాల్గొన్నారు.

సంఘటితంగా పోరాడాలి

చిట్యాల : సమస్యల పరిష్కారానికి కార్మికులంతా సంఘటితంగా పోరాడాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దరిపెల్లి చంద్రం పిలుపునిచ్చారు. చిట్యాలలో శనివారం జరిగిన ఆ సంఘం జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ కార్మిక సంఘంలో కార్మికులంతా సభ్యత్వాన్ని పొందాలన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం వేయి కోట్ల రూపాయల నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడిగా చిట్యాల పట్టణానికి చెందిన పాల భిక్షంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి తొట్ల పరశురాములు, మంచాల గణేష్, పాల నర్సింహ, చింతకింది విజయ్ పాల్గొన్నారు.

గంజాయి విక్రేత అరెస్ట్

సూర్యాపేట క్రైం : గంజాయి విక్రేతను సూర్యాపేట పోలీసులు శనివారం అరెస్టు చేశారు. పట్టణంలోని సీతారామాపురం కాలనీకి చెందిన సాయినవీన్ కొంతకాలంగా గంజాయి విక్రయిస్తున్నాడు. సాయి నవీన్ జనవరిలో పట్టుబడిన గంజాయి ముఠాలో సభ్యుడు. అయితే పోలీసుల నుంచి మూడు నెలలుగా తప్పించుకు తిరుగుతున్నాడు. పోలీసులు శనివారం సీతారామపురం కాలనీలో సాయి నవీన్ నుంచి 250గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకొని అరెస్టు చేశారు. అదే విధంగా సాయి నవీన్‌ను అదుపులోకి తీసుకునే సమయం లోపట్టణానికి చెందిన ప్రముఖ వస్త్ర వ్యాపారి కుమారుడితో పాటు మరో ఇద్దరిని పోలీసులు వదిలేసినట్లు సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ విషయాన్ని సీఐ రాజశేఖర్ కొట్టిపారేశారు.

ధాన్యం కొనుగోళ్లకు సిద్ధంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, పాల్గొన్న ఆయా శాఖల అధికారులు

- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

నల్లగొండ : జిల్లాలో యాసంగి సీజన్‌లో ధాన్యం సేకరణకు ఆయా శాఖల అధికారులు ముందస్తు ప్రణాళిక రూపొందించి ప్రభుత్వ ఆదేశాల మేరకు కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి కోరారు. శనివారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పౌర సరఫరాలు, మిల్లర్లు, గ్రామీణాభివృద్ధి, సహకార, వ్యవసాయ, మార్కెటింగ్, రవాణా శాఖల అధికారులతో యాసంగి ధాన్యం సేకరణపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 278 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించగా అందులో పీఏసీఎస్ 140, ఐకేపీ 138 కేంద్రాల ఏర్పాటుకు గ్రామీణాభివృద్ధి శాఖ, సహకార శాఖ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బంది లేకుండా అన్ని మౌలిక వసతులు కల్పించాలన్నారు. తూకం, తేమ యంత్రాలు, గన్నీలు, ప్యాడీ క్లీనర్‌లు, టార్పాలిన్‌లు సిద్ధం చేసుకోవాలని అన్నారు. గన్నీ బ్యాగులు పౌర సరఫరాల సంస్థ వద్ద 71 లక్షలు, మిల్లర్ల వద్ద 50 లక్షలు మొత్తం కోటీ 21 లక్షలు సిద్ధంగా ఉన్నాయన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, డీఆర్‌డీఓ కాళిందిని, జిల్లా సహకార అధికారి రాజేందర్ రెడ్డి ,జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటేశ్వర్లు, డీఎం నాగేశ్వర్‌రావు, జిల్లా వ్యవసాయ అధికారిణి సుచరిత, ఆర్‌టీఓ సురేష్‌రెడ్డి, మార్కెటింగ్ అధికారి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల పంపిణీకి సన్నద్ధమవుతాం

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసే గొర్రెల పంపిణీ పథకంలో భాగంగా గొల్ల కురుమలకు గొర్రె పంపిణీకి ఏర్పాట్లు చేస్తామని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి పేర్కొన్నారు. శనివారం సాయంత్రం రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో మాట్లాడారు. గొర్రెల పంపిణీ, వివిధ పథకాలపై పలు సూచనలు చేశారు. జిల్లా నుంచి కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పథకాల అమలు తీరును వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు ఖుష్బూ గుప్తా, భాస్కర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితుడికి కోమటిరెడ్డి ఆర్థికసాయం

- నిరుపేద యువకుడికి ఆపరేషన్ చేయించిన భువనగిరి ఎంపీ
- రూ.50వేలు అందజేత



రవీందర్ కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న కోమటిరెడ్డి వ్యక్తిగత సహాయకుడు

కనగల్: చిన వయస్సులో లోగ్రేడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న యువకుడికి ఆపరేషన్ చేయించడంతో పాటు వ్యక్తిగత సహాయకుడితో రూ.50వేల నగదు పంపి భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మానవత్వం చాటుకున్నారు. కనగల్ మండల కేంద్రానికి చెందిన గుండెబోయిన రవీందర్ 29ఏళ్ల వయస్సులోనే క్యాన్సర్ బారిన పడ్డాడు. ఇతనిది నిరుపేద కుటుంబం. భార్య దివ్యాంగురాలు కాగా మూడు, ఐదు ఏండ్ల లోపు కూతుళ్లు ఉన్నారు. ఆరు నెలల నుంచి రవీందర్ లోగ్రేడ్ క్యాన్సర్‌తో బాధపడుతూ హైదరాబాద్‌లోని కోఠి కామినేని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఎంపీ ఆస్పత్రి యాజమాన్యంతో మాట్లాడి రవీందర్ ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని ఆపరేషన్ చేయించారు. కుటుంబసభ్యులతో మాట్లాడి రవీందర్ పూర్తిగా కోలుకునే దాకా అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. సహాయం చేసిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి రవీందర్ కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

యోగా సాధనతో ఆరోగ్యం



నల్లగొండలోని టీఎన్‌జీఓస్ భవనంలో శిక్షణ ఇస్తున్న యోగా గురు

నల్లగొండ టూటౌన్ : నిత్యం యోగా సాధన చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండొచ్చని యోగా గురూజీ సంధ్య పేర్కొన్నారు. పోషణ పక్వాడలో భాగంగా శనివారం నల్లగొండ పట్టణంలోని టీఎన్‌జీఓస్ భవన్‌లో స్త్రీ శిశు సంక్షేమ శాఖ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లకు యోగాసనాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు తమ ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని, నిత్యం పని ఒత్తిడితో ఉండే అవకాశం ఉన్నందున యోగా సాధన చేసి మనసు ప్రశాంతంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం యోగా గురూజీ సంధ్యను జిల్లా స్త్రీ సంక్షేమ శాఖ అధికారి సుభద్ర ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీడీపీఓ నిర్మల, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



నకిరేకల్: దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

నకిరేకల్: ఔషధాలు, టోల్‌గేట్ల వద్ద చార్జీల పెంపును నిరసిస్తూ శనివారం నకిరేకల్‌లో సీపీఐఎంల్ న్యూడెమోక్రసీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు అంబటి చిరంజీవి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కోట్ల రూపాయలను కార్పొరేట్ బహుళ జాతి సంస్థలకు రాయితీలిస్తూ పేద ప్రజలపై పన్నుల భారం మోపడం తగదన్నారు. ఔషధాల రేట్లను 12 శాతానికి పెంచడం దారుణమన్నారు. పెంచిన రేట్లను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో నాయకులు చెరుకు సైదులు, బుడిగె శ్రీను, పసుపులేటి సోమయ్య, బొడ్డు శ్రీను, శేఖర్, అంబటి నవీన్, రాములు, కొప్పుల ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

కూతుళ్లు భరోసా ఇచ్చినా..

- కుటుంబాన్ని ఇబ్బంది పెట్టలేక ఆర్‌ఎంపీ బలవన్మరణం
- ఆర్థిక ఇబ్బందులే కారణం
- మృతుడు అర్వపల్లి వాసి



జమాలుద్దీన్(ఫైల్)


తొర్రూరు: 'నాన్నా.. మేము ఉద్యోగాలు చేసి అప్పులు తీరుస్తాం. మీరేమీ బాధపడొద్దు. ఎటువంటి అఘాయిత్యం చేసుకోవద్దు' అని ఇద్దరు కూతుళ్లు భరోసా ఇచ్చారు. అయినా అతని మనస్సు వినలేదు. అప్పులతో కుటుంబాన్ని ఇబ్బంది పెట్టొద్దని భావించిన ఓ ఆర్‌ఎంపీ బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో శనివారం చోటుచేసుకుంది. అదనపు ఎస్సై లింగారెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లా అర్వపల్లికి చెందిన ఎండీ జమాలుద్దీన్ (46) కొన్నేళ్ల క్రితం తొర్రూరుకు వచ్చి స్థిరపడ్డాడు. పట్టణంతో పాటు మండలంలోని చింతలపల్లి గ్రామంలో ఆర్‌ఎంపీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. అతనికి ఇద్దరు కుమార్తెలు మదీనా, రిజ్వానా ఉన్నారు. మదీనా డిగ్రీ పూర్తికాగా, రిజ్వానా ఇటీవల ఇంటర్ సెకండియర్ పరీక్షలు రాసింది. వారి విద్య, ఇంటి అవసరాల నిమిత్తం రూ.15లక్షల మేర అప్పులు చేశాడు. అప్పులు ఇచ్చిన వారు డబ్బుల కోసం ఒత్తిడి చేస్తుండడంతో తీవ్ర ఆవేదనకు లోనయ్యాడు. అప్పులు తీర్చేమార్గం కనిపించకపోవడంతో చావే శరణ్యమని తలచాడు. కుటుంబంతో సైతం పలు మార్లు ఈ విషయంపై తన ఆవేదనను వెల్లిబుచ్చగా తాము ఉద్యోగాలు చేసి అప్పులు తీరుస్తామని కూతుళ్లు భరోసానిచ్చారు. తీసుకున్న అప్పు, వడ్డీలు కట్టలేనని భావించి, కుటుంబాన్ని ఇబ్బందిపెట్టడం ఇష్టం లేక ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లోనుంచి బయటికి వచ్చిన జమాలుద్దీన్ అర్ధరాత్రి వరకు కూడా తిరిగి రాలేదు. భార్య ఫోన్‌కు ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు మెసేజ్ చేశాడు. ఆందోళన చెందిన భార్య పలుమార్లు ఫోన్ చేసినా స్పందించలేదు. కుటుంబ సభ్యులు వెతకగా శనివారం ఉదయం స్థానిక వ్యవసాయ మార్కెట్ సమీపంలో విగతజీవిగా కనిపించాడు. మృతుడు పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. మృతుడికి భార్య గౌసియా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మహబూబాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వేసవిలో పశువుల యాజమాన్యం కీలకం

- నడిగూడెం మండల పశువైద్యాధికారి డాక్టర్ అఖిల సూచనలు



వల్లాపురంలో ఆవుల మంద



నడిగూడెం : ఇప్పటికే వేసవి కాలం ప్రారంభమైంది. ఈ మూడు నెలలు పశువుల పెంపకంలో యాజమాన్య పద్ధతులు పాటించి, ఆయా సీజన్‌లలో ఎదురయ్యే ప్రతికూల వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పశుపోషణ, పాడి అభివృద్ధికి పలు జాగ్రత్తలు తీసుకోవాలని నడిగూడెం మండల పశువైద్యాధికారి డాక్టర్.బి.అఖిల చెబుతున్న సలహాలు, సూచనలు ఆమె మాటల్లోనే......

పాటించాల్సిన మెళకువలు

ఎండుగడ్డిని రాత్రి లేదా చల్లని వేళల్లో వేయాలి. వేడి ఎక్కువగా ఉన్నప్పుడు వేస్తే గడ్డిని జీర్ణం చేసుకొనే ప్రక్రియలో పశువుల ఒత్తిడికి గురై ఆయాస పడతాయి. సాధారణంగా వేసవిలో ఘనరూపంలో మేతను మామూలుకన్నా తక్కువగా తీసుకుంటాయి. అందువల్ల ఎక్కువ పోషక విలువలున్న మేతను సమీకృత దాణా ఇవ్వాలి. వేసవిలో పచ్చి మేత లభించేలా ముందస్తు చర్యలు చేపట్టాలి. లేదంటే మొలక గడ్డి రూపంలో ఉండేలా చేసుకోవాలి.వేసవిలో ఖనిజ లవణాల అవసరం ఎక్కువగా ఉంటుంది. రోజూ 60గ్రాముల ఖనిజ లవణ మిశ్రమాన్ని అందించాలి. వరి గడ్డిని మేతగా వాడే వారు అందులో పోషక విలువలు కలిపేలా చర్యలు తీసుకోవాలి. పచ్చిమేతలను, ఎండుగడ్డిని ముక్కలుగా చేసి మేపడం వలన గడ్డి వృథాకాకుండా నివారించవచ్చు. అయోడైజ్డ్ ఉప్పును దాణాతో పాటు ఇవ్వాలి. పాడి పశువులకు వేసవిలో చల్లటి శుభ్రమైన తాగు నీరు ఎక్కువసార్లు ఇవ్వడం వలన వేడిని తగ్గించవచ్చు. అందుబాటులో ఉంటే పశువులను రోజుకు రెండు మూడు సార్లు కడిగితే మేలు.

వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ఈ ఏడాది అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశమున్నది. వేసవిలో పశువులు వడదెబ్బ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. సాధారణంగా సంకర జాతి, జెర్సీ రకాల ఆవులు 37 డిగ్రీల ఉష్ణోగ్రతకే ఇబ్బందులు పడతాయి. శరీర ఉష్ణోగ్రత పెరిగి వేడిని అదుపులో ఉంచుకోవడానికి నోటి ద్వారా శ్వాసతీసుకుంటూ ఆయాస పడతాయి. ఈ సమయంలో మేత కూడా తక్కువగా తీసుకుంటాయి. దీని వలన పాల దిగుబడి కూడా తగ్గుతుంది. నల్లరంగు ఉండే గేదెలు ఎండ వేడికి మరింత ఇబ్బంది పడతాయి. వడదెబ్బకు గురికావడం, జ్వరం రావడం లేదా శరీరంలో నీటి శాతం తగ్గిపోయి, మరణాలు సంభవించే ప్రమాదం ఉంటుంది.

ముందు జాగ్రత్తలు తప్పనిసరి

వేసవిలో అగ్ని ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశమున్నది. ఒక వేళ ఆవులకు, గేదెలకు అగ్ని ప్రమాదంలో చిన్న చిన్న దెబ్బలు తగిలినా ప్రమాదమే. అలా జరిగిన రెండు మూడు రోజుల్లోనే చనిపోయే అవకాశాలు ఎక్కువ. పశువులు ఉండే పాకలు, ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలను నియంత్రించే ఏర్పాట్లు చేసుకోవాలి. పాక కాస్తంతా ఎత్తుగా ఉంటే వేడి తక్కువగా ఉంటుంది.తాటాకులు, భోద లాంటి వాటితో పాకకు కప్పి అప్పుడప్పుడు నీటితో తడపాలి. వేడి ఉక్కబోత ఎక్కువగా ఉన్నప్పుడు చల్లని నీడనిచ్చే చెట్ల క్రిందే పాకలు వేయాలి. చల్లని చెట్ల కిందనే పశువులను కట్టేయాలి.ఉష్ణోగ్రతను ఎంత తగ్గిస్తే అంత మేతను పశువుల తింటాయి. వడదెబ్బ తగిలితే పశువైద్యులను వెంటనే సంప్రదించాలి.